
# వినిపించని రాగాలు

కోరం రాజబాబు

చీకటిగదిలో ఒంటరిగా... మౌనంగా... ఓపికలేక ... నిస్సహాయంగా రోదిస్తూ... పిచ్చిదానిలా అరుస్తూ... జరిగింది అర్థంకాక, అలా జరుగుతుందని తెలీక ... ఆలోచనలు ఆగిపోయి ... ఆశలు చచ్చిపోయి చివరకు ఏ తోడూ లేనిదానిలా మిగిలిపోతానని నేనెప్పుడూ అనుకోలేదు. ఈ రాత్రి ఎప్పటికీ రాత్రిగానే ఉండాలన్న కోరికతోబాటు తెల్లారితే నేనేంటి? అన్న ప్రశ్న గుండెలో సన్నగా మొదలై నన్ను కుదిపేస్తుంటే... నా తలరాత రాసిన జ్ఞాపకాల్లోకి నెమ్మదిగా జారిపోయాను.



.....................

ప్రభు ... ఆరడుగుల మనిషి. రఫ్‌నేచర్. నేనేనాడూ నా ఫీలింగ్స్ చెప్పలేదతనికి. తనుమాత్రం ఎప్పుడూ ఏదీ దాచేవాడు కాదు, రెండేళ్ల వైవాహిక జీవితంలో నేను తనతో మాట్లాడిన దానికన్నా పోట్లాటలే ఎక్కువ. అలా పోట్లాడుతూ నా ఫీలింగ్స్‌ను దాచేసేదాన్ని. పైపై పోట్లాటలే మా మధ్య నడిచేవి. తను నామాట వినేవాడు కాదు. మొండిగా వాదించేవాడు. నేనెప్పుడన్నా కాస్త గట్టిగా మాట్లాడితే తను ఇంట్లో వున్న ఏదో ఒక వస్తువు నేలకు విసిరి కొట్టేవాడు. ఆ తర్వాత ఓ రెండు రోజులు మాత్రం కాస్త తాగుడు ఎక్కువయ్యేది. చివరకు నేనే కాంప్రమైజ్ అయ్యేదాన్ని. ఆ తర్వాత తను చూపించే ప్రేమ నా వూహాలకు అందేది కాదు. అలా కొన్ని రోజులు మాత్రమే. మళ్లీ ఏదో ఒక కారణంతో మా మధ్య చిరుకోపాలు. చివరకు అవి పెద్దవై చికాకులు మమ్మల్ని చుట్టేసేవి. ముఖ్యంగా నన్ను. తనతో మాట్లాడి, పోట్లాడి విసిగిపోయి జీవితం ఇంతేనా అనుకున్నప్పుడల్లా లెటర్స్ రాసేదాన్ని. అయితే ఒక్క లెటర్ కూడా తనకివ్వలేదు. వాటిని దాచిపెట్టేదాన్ని. బాధ కలిగినప్పుడల్లా చదువుకుని ఓదార్పు పొందేదాన్ని. ఒకసారి మాత్రం చాలా పెద్ద లెటరే రాశాను.

***డియర్ ప్రభూ?....!***

మీరు నన్ను చూసిన వెంటనే పెళ్లికి ఒప్పుకున్నప్పుడు నేనెంత మురిసిపోయానో మీకు తెలీదు. అదొక అదృష్టంగా భావించాను. అందరు ఆడపిల్లల్లాగే నేను కూడా కలల్లో తేలిపోయాను. జీవితం మొదలయాక నెమ్మదిగా తెలిసింది మీరేంటో. డిఫరెంట్‌గా వుండటం అంటే మీకు నచ్చినట్లు వుండటమేనా, మీతో నేనున్నానని మర్చిపోతే ఎలా? నన్నెంత బాధపెడ్తున్నారో మీకెప్పుడయినా అర్థమయ్యిందా? మీరొక మంచి ఎగ్జిక్యూటివ్. బయట ప్రపంచంలో కనిపించే ఆ లక్షణాలు ఇంట్లో ఎందుకు కనిపించవు? భార్యతో ఇలాగేనా మాట్లాడేది, అంత సీరియస్ జీవితాన్ని నేనెలా భరించాలి? కాస్త సున్నితంగా మాట్లాడితే మీ సొమ్మేమన్నా పోతుందా? సున్నితంగా పోట్లాడటం కూడా బాగుంటుంది. అసలు ఆడదాన్ని ఎలా ట్రీట్ చెయ్యాలో మీకు తెలీదు. పసిడి కాంతిలో మెరుస్తూ వుండే నా అందాన్ని మీరు అపురూపంగా చూసుకోగలరని మీ జీవితంలోకి వచ్చాను. మరి మీరేం చేశారు? నన్ను మోసం చేశారు. నా భావాల్ని కర్కశంగా నలిపేశారు. అనవసరమైన ఆవేశంతో అపురూప సంఘటనల్ని బాధాకరంగా మార్చేశారు. మొండిగా, మొరటుగా ప్రవర్తించారు. మన జీవితం గురించి నేనెంతో ఆలోచించాను. మధుర భావాలను గుండెలోతుల్లో దాచుకోవాలనుకున్నాను. అలా చేయటానికి అవి వుంటేగా? మీరే నాశనం చేశారు. మీ నుండి ఓ చిరునవ్వును, ఓ లాలింపును, ఓదార్పును ఆశించటం నేరమా? ఎప్పుడో ఓసారి అదీ.... మీరు కావాలనుకున్నప్పుడు వూపిరాడనంత ప్రేమను కుమ్మరిస్తే సరిపోతుందా? నాకో అనుమానం. మీరు ఆలోచిస్తారని అనుకోవడం కూడా నా

పిచ్చితనమే.

అన్నట్టు మీకో మాట! మీరు రోజూ రాత్రి ఇంటికి ఆలస్యంగా వస్తున్నారు. మీకోసం ఎదురు చూసి చూసి నేను అలసిపోతున్నాను. మీరు పగలంతా ఏదో ఒకటి తింటూ రాత్రయ్యేసరికి నాలుగు మెతుకులు తిని అయ్యిందనిపిస్తాను. మరి నా మాటేమిటి? అందుకే నేను మీ కోసం ఎదురు చూడకూడదని నిర్ణయించుకున్నాను. మీకు కోపం వచ్చినా సరే! నేను ముందే తినేస్తాను. కలిసి తినాలంటే మీరు తొందరగా ఇంటికి రావాలి. ఏంటి కండిషన్ పెడ్తోంది అనుకుంటున్నారా? మరేం చెయ్యను? నా మీద మీకు ఎలాగూ కోపం వస్తుంది కదా! ఇంకాస్త ఎక్కువ వస్తుంది. అంతేగా!

ఇంకోమాట...? మీకు స్వార్థం ఎక్కువ. పగలంతా మీరు ఫ్రెండ్స్‌తో హాయిగా తిరుగుతారు. మీది తిరిగే ఉద్యోగం కదా! రోజు గడపటం మీకు చాలా తేలిక. మరి నా పరిస్థితి? మీరు వెళ్లాక నేను ఒంటరిదాన్ని. ఈ మహాపట్నంలో నన్ను పడేశారు. ఇంకా కొన్నాళ్లు నా పరిస్థితి ఇలాగే వుంటే పిచ్చెక్కడం ఖాయం.

నాకు ఇంకా చాలా విషయాలు చెప్పాలనుంది. మరోసారి చెబుతాను. ఈ లెటర్ చదివాక కోపంతో మీరు అరుస్తారు. ఇల్లంతా రణరంగం అయిపోతుందేమో! అయినా సరే మీరు చదవాలనే లెటర్ రాస్తున్నాను. నన్ను గౌరవించమని నేనడగను. కనీసం నా ఫీలింగ్స్ ఏమిటో మీకు అర్థమైతే చాలు. ఆ తర్వాత మీ ఇష్టం.

**– మీ ప్రమీల**

రెండ్రోజులు గడిచాయి. నా ఊపిరి ఆగిపోయే వార్త. మాట అప్పటికే ఆగిపోయింది. మౌనంగా... ఉద్వేగంగా ఏడుస్తున్నాను. అలా ఏడుస్తూనే వున్నాను. గొంతెండిపోయింది. ఆలోచించే ఓపిక చచ్చి పోయింది.

నా చుట్టూ చాలామంది ఉన్నా ఎవ్వరితోనూ మాటకలపలేని నిస్సహాయత నాలో. నాకే ఎందుకిలా అయ్యింది? నేనేం పాపం చేశాను? అతిగా ఆశపడకే....! నీకు మంచి మొగుడే వస్తాడు అనేది అమ్మ. నేనేమన్నా అతిగా ఆశ పడ్డానా? అతిగా ఆశపడ్డదేదీ దొరకదంటారు. నేనేం కోరుకున్నాను? కాస్త నా గురించి ఆలోచించ మన్నాను. ప్రేమగా ఓ మాట ఆశించాను. అభిమానంగా చూడమన్నాను. నేనే తనకు నచ్చినదాన్నేగా? అంతెందుకు? తను దగ్గరగా వుంటే చాలు పులకరించి పోతాను. తనకు తెలీదా...! నేను ఏం కోరుకుంటున్నానో? తను లేకపోతే నాకు జీవితమే లేదని. ఒంటరిగా బతకలేనని తెలిసి ఎందుకు వెళ్లిపోయాడు? ఈ లోకాన్ని ఎందుకు అర్ధంతరంగా వదిలేశాడు?

ఇప్పుడు నేనేం చేయాలి? నా మనసులో వున్నదంతా కేవలం ఉక్రోషం మాత్రమే. తను లేని నాకు జీవితం ఎక్కడిది; ఆ మాట గట్టిగా అరిచి చెప్పాలనుంది. మోసగాడివని, స్వార్థపరుడివని, ఎందుకిలా చేశావని నిలదీయాలనుంది. తన మొరటుదనం, మొండితనం నాకు చాలా ఇష్టమని చెప్పాలనుంది. అప్పుడప్పుడూ కురిపించే ప్రేమ వెన్నెలంత హాయిగా వుంటుందని, ఆ చిరుకోపాలు, చిరుతాపాలు నాకెంతో ఇష్టమని మరీమరీ చెప్పాలనుంది.

ప్రభూ...! ప్రతీరాత్రీ నీకోసం ఎందుకు ఎదురు చూసేదాన్నోతెలుసా? నీతో కలిసి తినాలని మాత్రమే కాదు. నువ్వు తింటుంటే చూడాలని. ఎందుకంటే ...! నేను వండినదాంట్లో నా ప్రేమను నింపేశాను కాబట్టి.

నీకు తెలుసా ప్రభూ...! నువ్వు నా మనసును కదిలించిన సంఘటనలు నాకు గుర్తున్నాయి. అప్పుడు నా చూపులు నీవు గమనించలేదు. చూస్తే తెలిసేది నేనెంత పరవశించిపోయేదాన్నో. ప్రతిక్షణం నిన్ను నేను కోరుకున్నాను. అందుకే నువ్వు నా దగ్గరగా లేనప్పుడల్లా ఉక్రోషం, అక్కసు తన్నుకొచ్చేవి.

..........

నా జీవితం ఇప్పుడు నా చేతుల్లో లేదు. నేనేంటో నాకే తెలీదు. ఏడ్చే ఓపిక లేదు. నేనిప్పుడు ఒంటరిదాన్ని. ఒట్టి పిరికిదాన్ని కూడా. ఎందుకో చెప్పనా! నేను రాసిన లెటర్ నీకు ఇవ్వలేక పోయాను కాబట్టి. నువ్వు ఆ లెటర్ చదివితే మరింత దగ్గరగా వుంటావన్న పిచ్చి ఆశ తప్ప మరేమీ కాదు.

ప్రభూ... నువ్వు లేవు. నాకు జీవితం లేదు. ఏడ్చేందుకు కన్నీళ్లు కూడా లేవు. ఏం మిగిలాయో తెలుసా? జ్ఞాపకాలు, బోలెడన్ని అనుభూతులు. అంతకన్న ఎక్కువగా మరొకటుంది. అదే ... నీకివ్వకుండా దాచేసిన లెటర్.


# బరువు పెరిగేందుకు

☑ శారీరక శ్రమ తగ్గిపోవడం
☑ థైరాయిడ్ సమస్య
☑ డెలివరీ
☑ వంశపారంపర్యంగా సంక్రమించడం
☑ హార్మోన్ సమస్యల . . . . వలన

## మరి
# బరువు పెరగకుండా ?

బరువు పెరగకుండా వుండేందుకు ఏం చేయాలో వచ్చే సంచికలో తెలుసుకోండి.

CLINIC 2000
*Makes the difference*
Himayathnagar : 203, Sai Datta Arcade
Besides Mitra Agencies Maruti Show Room,
Himayathnagar, Hyderabad-500 029.
Ph : 5566 9595, 5561 5599, 2763 5522. www.clinic-2000.com

**The only Medical Center for Overweight & Laser hair removal**